క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: సీఎం రిలీఫ్ పథకంతో పేదలకు ఆర్థిక సహాయం అందుతుందని స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి చెప్పారు. శనవారం తన నివాసంలో నర్సాపూర్, కొడిపల్లి మండలాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. పథకం నుంచి పేదలకు ఆర్థిక సహాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు సుధాకర్ రెడ్డి, ఎల్లం తదితరులు ఉన్నారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులు



ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన వీర జవాన్ మురళి నాయక్‌కు నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండా గిరిజన నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శనివారం నార్సింగి మండల కేంద్రంలో నర్సంపల్లి పెద్ద తండా గిరిజన నాయకులు జాతీయ జెండానే చేతపట్టుకుని నివాళిగా ర్యాలీ నిర్వహించారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికుడికి జోహార్లు అంటు నినాదించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బిక్యానాయక్, మాజీ సర్పంచ్ ఛత్రియానాయక్, బాషానాయక్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

శ్రీ రేణుక ఎల్లమ్మదేవి పంచమ వార్షికోత్సవం



గంగ బోనం ఊరేగింపు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయ పంచమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారికి గంగ బోనం ఊరేగించారు. అంతకు ముందు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దిపేట ఒగ్గు కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పద్మశాలీల బండ్ల ఊరేగింపు



పద్మశాలీల సంఘం ఆధ్వర్యంలో బండ్ల ఊరేగింపు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో కొలువైన శ్రీ రంగనాయక స్వామి పంచాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలు మూడు రోజుల నుంచి వైభవంగా కొనసాగుతూ వస్తున్నాయి. శనివారం తెల్లవారుజామున స్వామివారిని అశ్వ వాహనంపై ఊరేగించారు. సాయంత్రం గ్రామ పద్మశాలీల సంఘం ఆధ్వర్యంలో ఆనవాయితీ ప్రకారం స్వామివారికి బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య ఉత్సాహంగా కొనసాగింది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

అమ్మవారికి ఒడిబియ్యం



అమ్మవారికి ఒడిబియ్యం సమర్పిస్తున్న మహిళలు

నర్సాపూర్: నర్సాపూర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీకన్యకా పరమేశ్వరీ మాతకు శనివారం మహిళలు ఒడిబియ్యం సమర్పించారు. ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన ఆలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. కాగా శనివారం మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి వచ్చి అమ్మ వారికి ఒడిబియ్యం సమర్పించి సహస్ర పారాయణం చేశారు.

టంకర్ల తయారీ.. మహిళలకు ఉపాధి

- వెయ్యి మామిడి కాయలు తరిగితే రూ.500
- స్థానికులకు రెండు నెలలు ఉపాధి
- అకాల వర్షాలతో తీరని నష్టం



కల్వకుంట గ్రామంలో టంకర్లను తరుగుతున్న మహిళలు

నిజాంపేట(మెదక్): సీజనల్ పనులతో సంచార జీవులు ఉపాధి పొందుతున్నారు. ఉత్పత్తులను పొరుగు జిల్లాలకు ఎగుమతి చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. నిజాంపేట మండలం కల్వకుంటలో మామిడి టంకర్లతో ఉపాధి పొందేవారు వందల సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా సంచార జీవులతో పాటు ఇతర సామాజిక వర్గం వారు టంకర్ల ఎగుమతి చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారు. కల్వకుంట గ్రామానికి చెందిన కొందరు వ్యాపారులు పరిసర గ్రామాల నుంచి మామిడి కాయలు పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నారు. చెట్లకు పూత దశల్లో ఉన్నప్పుడు మండలంతో పాటు చుట్టూ పక్కల ఉన్న మండలంలోని మామిడి తోటలు తిరిగి చెట్లకు కాసిన కాయలను అంచనా వేసి కొనుగోలు చేస్తుంటారు. మే మాసంలో చెట్లకు కాసిన కాయలు తీసి గ్రామానికి తీసుకొస్తుంటారు. దాదాపుగా 20 నుంచి 30 మంది ఇలా వ్యాపారం చేస్తుంటారు. ఇలా ఒక్కో వ్యాపారి వద్ద 10 నుంచి 20 మంది వరకు వ్యాపారులు మామిడి టంకర్ల (వరుగు) తయారీ చేస్తుంటారు. దీన్ని ఔషధాలు, తినుబండారాలతో పాటు ఇతర పదార్థాలలో వాడుతారు.

చెట్ల కింద టంకర్ల తయారీ

చెట్ల నీడలో మామిడికాయలు పొట్టు తీసి, ముక్కలు కోసి ఎండలో ఎండబెడ్తారు. ఈ టంకర్ల తయారీలో చాలా మంది మహిళ కూలీలు ఉపాధి పొందుతున్నారు. రెండు నెలల పాటు పని దొరుకుతుందని కూలీలు చెబుతున్నారు. తయారైన టంకర్లను పొరుగున్న ఉన్న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మార్కెట్‌కు తరలిస్తారు. కూలీలకు వంద కాయలు తరిగితే రూ.50 ఇస్తున్నారు. ఒక్కో మహిళా కూలీ ఒక రోజుకు 1,000 మామిడి కాయలు తరిగితే రూ. 500 మాత్రమే గిట్టుబాటు అవుతోంది. క్వింటాలు ధర రూ రూ.23 వేల వరకు పెరిగితే తప్ప తమ కష్టానికి తగిన ఫలితం ఉంటుందని చెబుతున్నారు. మామిడి తోటల రైతులకు మార్కెట్ సదుపాయం అందుబాటులో లేకపోవడంతో రైతులు మామిడి టంకర్ల వ్యాపారం చేసి వ్యాపారం చేసే వారికి కాయలు అమ్ముకుంటున్నారు.

అకాల వర్షాలతో నష్టం



మామిడి కాయలను పిందె దశలో ఉన్నప్పుడు మామిడి కాయలు ధర నిర్ణయించి కొనుగోలు చేస్తాం. కానీ ఈ మధ్య కాలంలో ఈదురుగాలులు, అకాల వర్షాలు కురిసినా వ్యాపారం నష్టం వాటిల్లింది. వర్షాలతో టంకర్ల కాయలు రంగు మారుతుంది. ఈదురుగాలులతో వర్షానికి నేలరాలిన కాయలు టంకర్ల నాణ్యత లోపిస్తుంది. దీంతో వ్యాపారం నష్టం వస్తుంది.

– రంగ రమేష్, వ్యాపారి, కల్వకుంట

చదువుతో పాటు క్రీడలూ ముఖ్యం

మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి



క్రికెట్ టోర్నీని ప్రారంభిస్తున్న రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): విద్యార్థులు చదువులతోనే కాకుడా క్రీడల పట్ల కూడా ఆసక్తి చూపి ఉన్నత స్థాయిలో రాణించాలని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ మండల పరిధిలోని మక్తభూపతిపూర్‌లో క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని అన్నారు. వేసవి సెలవుల్లో పిల్లలు మొబైల్ ఫోన్‌లలో చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడలపై దృష్టి సారించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. క్రీడాకారులతో కరచాలనం చేసిన సీఐ టోర్నీని ప్రారంభించారు. ఈ టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులకు మల్లేశం సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింలు, ఘట్టయ్య, అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గట్టాగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల యూత్ ప్రెసిడెంట్ కొమ్ము పవన్, మాజీ వార్డు సభ్యుడు గట్టయ్య, నిర్వాహకులు మహమ్మద్ ఖుర్షీద్, బక్కన్నగారి శ్రీహరి, రవీందర్, ప్రభాకర్, దుర్గారాములు తదితరుల ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఆందోళన



పరిశ్రమ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

శివ్వంపేట(నర్సాపూర్): కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న సుగుణ ఫుడ్స్ లిమిటెడ్ పరిశ్రమపై ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీఐటీయూ యూనియన్ అధ్యక్షుడు మల్లేష్ అన్నారు. శనివారం పరిశ్రమ ఫీడ్‌మిల్ ఎదుట పలువురు కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. పరిశ్రమలోని పర్మనెంట్ డ్రైవర్లకు డ్యూటీ వేయకుండా ప్రైవేటు వారికి ఇస్తుండటం వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా కార్మికులను ఇక్కడ నుంచి ఇతర చోట్లకు బదిలీ చేస్తుండడం పట్ల సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిశ్రమ కార్మికులు మల్లగౌడ్, సుదర్శన్, యాద గిరి, ఖాసీం, ప్రతాప్, పోచయ్య, తదితరులు ఉన్నారు.

మత్తు పదార్థాలపై గిరిజనులకు అవగాహన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజు అధికారులు

నర్సాపూర్: మత్తు పదార్థాలపై గిరిజనులకు అవగాహన కల్పించినట్లు స్థానిక ఇన్‌చార్జి ఎక్సైజ్ సీఐ గోపాల్ చెప్పారు. శనివారం ఉదయం నర్సాపూర్ సంగారెడ్డి మార్గంలో పలు వాహనాలు తనిఖీ చేశామని తెలిపారు. అనంతరం మండలంలోని సూర్యతండా, హరియా తండా, మాదాపూర్ తండాలకు చెందిన గిరిజనులకు పలు అంశాలపై అవగాహన కల్పించామని చెప్పారు. నాటుసారా తయారు చేయడం, గంజాయి, డ్రగ్స్, కల్లులో కలిపే మత్తు పదార్థాలు కల్గి ఉండటం అమ్మడం నేరమని వారికి అవగాహన కల్పించామని, ఎవరైనా వాటిని అమ్మినట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి వారి సమాచారం రహస్యంగా ఉంచుతామని వారికి వివరించినట్లు గోపాల్ చెప్పారు. తనతో పాటు తమ సిబ్బంది పాల్గొన్నారని ఆయన వివరించారు.

కనుల పండువగా బ్రహ్మోత్సవాలు



స్వామివారు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ఆలయ పూజారి గోపాలకృష్ణ ప్రత్యేక పూజల నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రధాన వీధుల గుండా పల్లకిసేవ ఊరేగింపు చేపట్టారు. భక్తులు హారతులు ఇచ్చి పూజలు చేపట్టారు.

నేడు విద్యుత్ సరాఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట మండలం సూరారం, భగిరథపల్లిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దినకర్, ఏడీఈ మోహన్‌బాబు తెలిపారు. లైన్‌ల మరమ్మతులలో భాగంగా సబ్‌స్టేషన్ మరమ్మతులు, చెట్ల నరికివేత నిర్వహిస్తున్నందున విద్యుత్ సరాఫరాకు అంతరాయం ఏర్పడనుందన్నారు. విద్యుత్ వినియోగదారులుఫీ విషయం గమనించి సహకరించాలని ఆయన కోరారు.

కెమికల్ పరిశ్రమలో చోరీ

తూప్రాన్: పట్టణ పరిధిలోని రావెల్లి సమీపంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో చోరీ జరిగింది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని సంక్షేన్ కెమికల్ పరిశ్రమలో ఈనెల 7న విలువైన సామగ్రితో పాటు రూ. లక్ష విలువైన వ్యవసాయ పనిముట్లను ఆటోలో అపహరించుకెళ్లినట్లు పరిశ్రమ సెక్యూరిటీ గార్డు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

‘ఉపాధి హామీ’ని నిర్వీర్యం చేసే కుట్ర

వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి మల్లేశం



ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న మల్లేశం

హవేళిఘణాపూర్(మెదక్): పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నిర్వీర్యం చేయాలని చూస్తుందని వ్యవసాయ కార్మిక జిల్లా కార్యదర్శి మల్లేశం శనివారం ఆరోపించారు. మండల పరిధిలోని లింగ్సాన్‌పల్లిలో ఉపాధి హామీ పనులు చేపడుతున్న కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ కూలీలకు కనీస వసతులు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కవిత, శంకర్, బన్సీ, రమేశ్, కిషన్, పంజి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు



అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని మహమ్మద్‌నగర్ గేట్ తండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఏఎన్ఎం రాజమణి, వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరం ఉన్న వారికి వ్యాధి నిరోధక టీకాలు వేశారు. రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు, పాలు, కోడి గుడ్లు ఆహారంలో అధికంగా తీసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రంలో పంపిణీ చేసే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఫరీద్‌పూర్ చెరువుకు జలకళ



ఫరీద్‌పూర్ చెరువు

హవేళిఘణాపూర్(మెదక్): మండుతున్న ఎండలతో చుక్కనీరు లేక వెలవెలబోతుంటే మండల పరిధిలోని ఫరీద్‌పూర్ చెరువు మాత్రం నిండుకుండలా మత్తడి వరకు నీరు నిలిచి ఉంది. కొద్దిరోజులైతే అలుగు పారుతుందన్నట్టుగా ఉంది. కొంత కాలంగా ఎంఎన్ కెనాల్ నుంచి నీటిని వదలగా రైతులు చెరువును నింపారు. దీంతో చుట్టుపక్కల ఉన్న రైతుల బోర్లకు భూగర్భ జలాలు పెరిగి పంటలు సమృద్ధిగా పండించుకున్నారు.

వీర జవాన్లకు ఘన నివాళి



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

వెల్దుర్తి(తూప్రాన్): దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వీర జవాన్ మురళీ నాయక్ మృతికి సంతాపంగా మండల కేంద్రం వెల్దుర్తిలో శనివారం రాత్రి యువకులు కొవ్వొత్తు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ చౌరస్తా నుంచి మొదలైన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. దారి పొడవునా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా యువకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

మనోహరాబాద్(తూప్రాన్): ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాక్‌తో జరుగుతున్న యుద్ధంలో అమరులైన జవాన్లకు మనోహరాబాద్ మండలంలోని కూచారం గ్రామస్తులు నివాళులర్పించారు. శనివారం గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.



కూచారంలో కొవ్వొత్తుల ర్యాలీ..

మూగజీవాల దాహం.. దాహం



నీరులేక, ధ్వంసమైన సాసర్‌పిట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): అడవిలో మూగజీవాల కోసం ఏర్పాటు చేసిన సాసర్‌పిట్లలో నీరులేక నిరుపయోగంగా మారాయి. దీంతో మూగజీవాల దాహార్తి తీరకుండా పోతుంది. మండల కేంద్రమైన కౌడిపల్లి అడవిలో కూకుట్లపల్లి వెళ్లే దారిలోని బండగుట్ట అడవిలో మూగజీవాల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ అధికారులు గతంలో సాసర్‌పిట్లు ఏర్పాటు చేశారు. అయితే అందులో నీరు మాత్రం పోయలేదు. అసలే ఎండలు మండుతుండటంతో మూగజీవాలకు తాగు నీటి సదుపాయం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో పాడిగేదె మృతి



పాడి గేదె కళేబరం

వెల్దుర్తి(తూప్రాన్): మేతకు వెళ్లిన పాడిగేదె ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ సంఘటన మండలంలోని ఉప్పులింగాపూర్ శివారులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుత్తి ప్రభాకర్ వ్యవసాయంతో పాటు పాడి గేదెల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో రోజూ మాదిరిగానే శనివారం గేదెలను మేతకు తీసుకెళ్లగా గ్రామ శివారులోని ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో పాడి గేదె మృత్యువాత పడింది. విద్యుత్ అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతు వేడుకున్నాడు.

సంక్షిప్త వార్తలు

◆ స్వాములకు వంట సామగ్రి అందజేత

నర్సాపూర్ రూరల్: మండలంలోని బ్రాహ్మణపల్లి హనుమాన్ మాల స్వాములకు గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మీనారాయణ జ్ఞాపకార్థం అతని కుమారులు నర్సింలు రాజులు వంట పాత్రలు అందజేశారు. పాత్లోత్ సంతు నాయక్ మిక్సీ, ఫ్యాన్లు అందజేశారు. హనుమాన్ మాల స్వాములకు కావలసిన సామగ్రిని అందజేయడం అభినందనీయమని హనుమాన్ మాల గురుస్వామి సుధీర్ గౌడ్, అరుణ్ నర్సింలు రంజిత్ లు అన్నారు.

◆ ఆలయ ప్రహరీ పనులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన పురాతన కోదండరామస్వామి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులు శనివారం చేపట్టారు. ఆలయ ప్రహరీ గోడ కూలిపోవడంతో పురోహితుడు శ్రీవాత్సవ్‌శర్మ తన సొంత నిధులతో కూలిపోయిన ప్రహరీ గోడ పునర్నిర్మాణ పనులు చేపట్టాడు. మరికొందరు దాతలు ముందుకు వస్తే పురాతన కోదండరామస్వామి ఆలయం అభివృద్ధి చేసేందుకు ఆస్కారం ఉందన్నారు.

◆ అన్నదానం..



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల శ్రీఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితుడు మెట్టురాములుశర్మ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి చందన అలంకరణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల పూజలు చేసి అన్నదానం చేశారు.

◆ శనేశ్వర ఆలయంలో పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): శనిత్రయోదశి సందర్భంగా మండలంలోని వెల్మకన్నలోగల శ్రీశనేశ్వరాలయంలో శనివారం శనేశ్వరుడికి భక్తులు తైలాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు ఉమాశంకరశర్మ, రవిప్రసాద్‌శర్మ, మురళీధర్‌శర్మ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

◆ పాపన్నపేట బీజేపీ అధ్యక్షుడిగా సంతోష్

పాపన్నపేట(మెదక్): మండల బీజేపీ అధ్యక్షుడిగా సంతోష్‌చారి ఎన్నికయ్యారు. ఎంపీ రఘునందన్‌రావు ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్ నియామక పత్రాన్ని నర్సాపూర్‌లో సంతోష్‌కు అందజేశారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సత్యనారాయణ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్, పాల్గొన్నారు.

◆ ‘అరుణోదయ’ 50 వసంతాల సభ రేపు

దుబ్బాక: హైదరబాద్‌లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 12న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య 50 వసంతాల సభ నిర్వహించనున్నట్లు రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు ఎల్లం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1974, మే 12న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అమరులు చంద్రశేఖర్, ప్రసాద్‌లో చొరవతో అరుణోదయ సమాఖ్య ఏర్పడిందన్నారు. ఆనాటి నుంచి బూటకపు ఎన్‌కౌంటర్లు, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, విద్యార్థి, మహిళలు, ఆదివాసులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పోరాడుతుందన్నారు. సభను విజయవంతం చేయాలని కోరారు.

◆ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదం

కొండపాక(గజ్వేల్): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పీఏసీఎస్ డైరెక్టరు బూర్గుల సురేందర్‌రావు అన్నారు. మండల పరిధిలోని వెలికట్ట గ్రామంలో శనివారం మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. చదువుతోపాటు క్రీడలు కూడా భవిష్యత్‌లో ఎంతో ఉపయోగకరంగా మారుతాయన్నారు. మానసిక ప్రశాంతత, శారీరక ధారుడ్యం పెంపొందించేందుకు క్రీడలు దోహదం చేస్తాయని చెప్పారు. సమాజంలో క్రీడాకారులకు మంచి గుర్తింపు ఉందన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగారావు, నాయకులు సంపత్ కుమార్, మహేశ్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.